క్లుప్తంగా

మహిళా ఉద్యోగులకు అభినందన



నెల్లూరు రూరల్: రెవెన్యూ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కలెక్టరేట్ మహిళా ఉద్యోగులను డీఆర్వో హుస్సేన్ సాహెబ్ మంగళవారం అభినందించారు. కలెక్టరేట్లో డీఆర్ఓను మహిళా ఉద్యోగులు కలిశారు. ఏట విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేసీకి సత్కారం



నెల్లూరు రూరల్: జేసీ కార్తీక్‌ను ఆయన చాంబర్‌లో జిల్లా క్రీడల కన్వీనర్, డీఆర్వో హుస్సేన్ సాహెబ్, ఏట విజయ్‌కుమార్, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, జిల్లా కార్యదర్శి డానియెల్ పీటర్‌రావు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఆయన్ను సత్కరించి రెవెన్యూ అసోసియేషన్ తరఫున జ్ఞాపికను అందజేశారు.

మహిళా న్యాయవాది మృతి



అలేఖ్య (ఫైల్)

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యురాలు, మహిళా న్యాయవాది ఏనుగు అలేఖ్య (33) అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలోని హాస్పిటల్లో మంగళవారం మృతి చెందారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ పరీక్ష



నెల్లూరు(అర్బన్): లెక్చరర్ల పోస్టుల భర్తీకి సంబంధించిన ఏపీపీఎస్సీ పరీక్షను పొట్టేపాళెం సమీపంలోని అయాన్ డిజిటల్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. కేంద్రాన్ని డీఆర్వో హుస్సేన్ సాహెబ్ తనిఖీ చేశారు. పరీక్షలు ఈ నెల 23 వరకు జరగనున్నాయి.

వ్యక్తిపై దాడి



నెల్లూరు సిటీ: వ్యక్తిపై కొందరు యువకులు దాడికి పాల్పడిన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. నవాబుపేట పోలీసుల కథనం మేరకు.. నగరంలోని శెట్టిగుంటరోడ్డు సమీపంలో అద్దె ఇంట్లో కొందరు ఉంటున్నారు. వీరు నిత్యం మద్యం తాగుతుండటంతో వారిని ఖాళీ చేయించాలని స్థానికంగా ఉండే మాదాల నరేంద్ర సదరు ఇంటి యజమానికి చెప్పారు. ఇదే విషయాన్ని వారికి యజమాని చెప్పాడు. దీంతో నరేంద్రపై కక్ష పెంచుకున్న వారు విషయాన్ని రౌడీషీటర్ విష్ణువర్ధన్‌కు తెలిపారు. పెన్నానది వద్దకు నరేంద్ర వెళ్లగా, రౌడీషీటర్ తన మిత్రులతో కలిసి అతడిపై కత్తితో దాడికి పాల్పడ్డారు. స్థానికులు గుర్తించి నరేంద్రను హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు బాధితుడి వద్ద వివరాలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

19 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ స్టేడియంలో అండర్ – 11, 13, 15, 17, 19 విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, మెన్, ఉమెన్స్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను ఈ నెల 19 నుంచి నిర్వహించనున్నామని బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు తమ పేర్లను గురువారం సాయంత్రంలోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగమిప్పిస్తామంటూ టోకరా

నెల్లూరు సిటీ: విదేశాల్లో సూపర్‌వైజర్‌గా ఉద్యోగమిప్పిస్తామంటూ టోకరా వేసిన ఉదంతంపై చిన్నబజార్ పోలీసులను బాధితుడు ఆశ్రయించారు. వివరాలు.. రంగనాయకులపేటలో నివాసం ఉంటున్న లియాఖత్ ఉల్ హక్ ఏసీ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నారు. ట్రంక్‌రోడ్డులోని ఓ దుస్తుల షాపు యజమాని మున్వర్‌తో ఈయన తండ్రి జహూర్ ఉల్‌హక్‌కు పరిచయం ఏర్పడింది. తన కుమార్తె షబీనా కన్సల్టెన్సీని నిర్వహిస్తూ విదేశాల్లో ఉద్యోగమిప్పిస్తోందంటూ మున్వర్ నమ్మబలికారు. ఈ తరుణంలో గతేడాది ఫిబ్రవరిలో విడతల వారీగా రూ.ఆరు లక్షలను లియాఖత్ ఉల్ హక్ సమర్పించారు. అయితే ఉద్యోగం రాకపోవడం.. నగదునూ తిరిగి చెల్లించకపోవడంతో పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువల్లో వ్యర్థాలేయొద్దు



సిల్ట్ తొలగింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): కాలువల్లో మురుగు ప్రవాహానికి అడ్డంకిగా మారే ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. 42వ డివిజన్లోని మన్సూర్‌నగర్, పరమేశ్వరినగర్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. రామిరెడ్డి కాలువలో వ్యర్థాలేయకుండా సంబంధిత సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం 46వ డివిజన్లోని బృందావనం, శ్రీనివాసాగ్రహారం, రామచంద్రారెడ్డి ఆస్పత్రి రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి.. కాలువలపై అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. 42వ డివిజన్లో నగరపాలక సంస్థకు చెందిన వెహికల్ షెడ్డును తనిఖీ చేశారు.

➡ శిక్షణ ద్వారా వ్యాపారంలో మెళకువలను నేర్చుకోవాలని కమిషనర్ నందన్ సూచించారు. యాంట్రప్రెనార్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా స్మార్ట్ స్ట్రీట్ వెండార్లకు మెప్మా ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణను నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశం మందిరంలో ప్రారంభించిన అనంతరం అయన మాట్లాడారు. నిరుపేద మహిళలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా నిర్దేశించిన శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణలో భాగంగా చెన్నైలో ఫీల్డ్ వెరిఫికేషన్‌కు తీసుకెళ్లి స్ట్రీట్ వెండింగ్ విధానాలపై అవగాహన కల్పించనున్నామని వెల్లడించారు. ట్రెయినర్లుగా రాజ్యలక్ష్మి, మధు వ్యవహరించారు.

➡ ట్యాక్స్ రివిజన్ సర్వేను అన్ని డివిజన్లలో పూర్తి స్థాయిలో ముగించి సమగ్ర నివేదికను అందజేయాలని కమిషనర్ నందన్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ శాఖతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రెవెన్యూ వసూళ్లను 20 శాతం అదనంగా పెంచాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

➡ కార్పొరేషన్ కార్యాలయంలోని పలు విభాగాలను కమిషనర్ నందన్ పరిశీలించారు. ప్రజలకు సంబంధించిన సేవలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని సూచించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణధర్మరాజస్వామి దేవస్థానంలో 21 రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. యుదిష్టర పట్టాభిషేకాన్ని వేడుకగా నిర్వహించారు. అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం అందజేశారు. ఉభయకర్తలుగా నాగభీమేశ్వరరావు, వసంతలక్ష్మి, మల్లికార్జున, కవిత, దొంతంశెట్టి కుమార్ దంపతులు వ్యవహరించారు. ఈఓ జానకి పర్యవేక్షించారు.

క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు సిటీ: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ.. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హామీలను నెరవేర్చడంలో విఫలమైన కూటమి ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించనున్నామని చెప్పారు.

గ్యాస్ వినియోగంలో మెళకువలు పాటించాలి



నెల్లూరు(పొగతోట): గ్యాస్‌ను వినియోగించే సమయంలో మెళకువలు పాటించాలని హెచ్‌పీ గ్యాస్ అసోసియేషన్ జిల్లా నేతలు పేర్కొన్నారు. గ్యాస్ వినియోగంపై ఎన్టీఆర్‌నగర్‌లో ఇంటింటి అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలపై వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

రైతులపై అక్రమ కేసులను ఎత్తేయాలి



కాంగ్రెస్ నేతల నిరసన దీక్ష

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భూములిచ్చేందుకు నిరాకరించిన రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని కాంగ్రెస్ పార్టీ సిటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కరేడులో భూసేకరణను నిలిపేయాలంటూ వీఆర్సీ సెంటర్ వద్ద నిరసన దీక్షను పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. దీక్షకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ మద్దతు తెలిపారు. నేతలు సుధాకర్‌రెడ్డి, హనీఫ్, సుజాత, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్, ఈఎస్ఐపై కార్మికులకు అవగాహన



మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

నెల్లూరు సిటీ: పీఎఫ్, ఈఎస్ఐపై ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అవగాహన కల్పించారు. నగరంలోని ప్రధాన బస్టాండ్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈడీ నాగేంద్ర ప్రసాద్, జిల్లా ప్రజా రవాణాధికారి షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ మహాసంఘ నూతన కార్యవర్గ ఏర్పాటు



నెల్లూరు(బృందావనం): అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఓ కల్యాణ మండపంలో అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ, ఆంధ్రప్రదేశ్ విభాగ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మహాసంఘ జిల్లా గౌరవాధ్యక్షుడిగా శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడిగా రేవూరు వెంకటకళాధర్‌రావు, కార్యదర్శిగా మామిడిపల్లి చంద్రశేఖర్, కోశాధికారిగా భట్టారం రాఘవేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడిగా గావి మాధవాచార్యులు, అర్చక, పురోహిత విభాగ గౌరవ సలహాదారులుగా నాగరాజుతో కార్యవర్గం ఏర్పాటైంది. కేంద్ర కమిటీ అనుమతితో ఏర్పాటైన కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేశారు.

ఆదిశంకర ధ్యాన మందిరానికి బౌద్ధ గురువులు



నెల్లూరు(బృందావనం): పొగతోటలోని చక్రాల వారి ట్రస్ట్ ఆదిశంకర ధ్యాన మందిరానికి బౌద్ధగురువులు కోవానే పాలితథెరో (శ్రీలంక), షిమాడా యూషి (జపాన్) బోధిహీన్ మంగళవారం విచ్చేశారు. ఆదిశంకర భగవత్పాదులును దర్శించుకున్నారు. అనంతరం వీరిని సత్కరించారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్, ఇందుకూరుపేట లలితా భరద్వాజ దత్తాశ్రమ పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి, మందిర మేనేజర్ స్వామి సమయానందనాథ, రామాయణం మణిశంకర్, తంగిరాల వెంకటశ్రీకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

పొగతోటలోని చక్రాల వారి ట్రస్ట్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పాత మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో గల పట్టణ నిరాశ్రయులు, వృద్ధుల కేంద్రం , పంచవటి ఆశ్రమంలో అన్నదానాన్ని నిర్వహించారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్, పంచవటి ఆశ్రమ పీఠాధిపతి ఆత్మానందగిరి, నిరాశ్రయుల కేంద్ర నిర్వాహకుడు దాసరి సుందరం, చక్రాల వారి ట్రస్ట్ నిర్వాహకుడు చక్రాల వెంకట లక్ష్మీనరసింహం, మైపాడు రాజాశర్మ, అన్నవరం సత్యనారాయణమూర్తి, పామర్తి వెంకటలీలామోహన్, ములుమూడి ఉదయ్‌కుమార్, శ్రీహరిప్రసాద్‌రావు, మల్లవరపు లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సర్వీసులకు ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు జిల్లా స్టోర్స్‌లో సిద్ధంగా ఉన్నాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్ నుంచి జిల్లా అధికారులతో మంగళవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. నూతన వ్యవసాయ సర్వీసులకు వచ్చిన దరఖాస్తులకు అంచనాలను రూపొందించాలని, పూర్తయిన వాటిని వెంటనే అందజేయనున్నామని వెల్లడించారు. ఇప్పటికే మంజూరైన కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లను సంబంధిత అధికారులు తీసుకోలేదని తెలిపారు. ఈఈ శేషాద్రిబాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

శ్రామికుల సంఖ్యను పెంచండి

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పనులకు హాజరయ్యే శ్రామికుల సంఖ్యను పెంచాలని.. రోజూ లక్ష మందికి తగ్గకుండా చూడాలని డ్వామా పీడీ గంగాభవాని ఆదేశించారు. నగరంలోని డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల ఏపీఓలు, ఈసీలతో మంగళవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. పంట కుంటలు, సోప్‌పిట్ లక్ష్యాలను వంద శాతం సాధించాలని సూచించారు. పనుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్లాంటేషన్లకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

అక్రమాలను ప్రశ్నించినందుకే బదిలీ

నెల్లూరు(బారకాసు): కావలి మున్సిపల్ కమిషనర్ అవినీతి, అక్రమాలను ప్రశ్నించినందుకే తనను అక్రమంగా బదిలీ చేశారని సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ రావెళ్ల భాస్కర్ ఆరోపించారు. కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ఆయన చేపట్టిన దీక్ష మంగళవారం కొనసాగింది.

గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష

నెల్లూరు సిటీ: గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆగస్ట్ 27 నుంచి ప్రారంభంకానున్న వినాయక చవితి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. గణేశ్ ఘాట్ వద్ద ముందస్తు సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నామని తెలిపారు.

న్యాయం చేయాలని వినతి

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ ఉద్యోగులకు బయటి వ్యక్తుల బెదిరింపులు అధికమవుతున్నాయని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఉద్యోగ సంఘ జిల్లా నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. అవినీతికి పాల్పడిన ఉద్యోగులను తామే సస్పెండ్ చేయించామని.. తాము చెప్పింది చేయక పోయినా.. అడిగింది ఇవ్వకపోయినా మీకూ ఇదే గతి పడుతుందంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

నెల్లూరు సిటీ: విద్యుదాఘాతానికి యువకుడు గాయపడిన ఘటన పెద్ద చెరుకూరులోని సిరి గార్డెన్స్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. సిరి గార్డెన్స్‌కు సమీపంలో నిర్వహిస్తున్న ఓ కార్యక్రమంలో షామియానాల పట్టలను యువకుడు మండల్ వేస్తుండగా, విద్యుత్ తీగలు తగిలాయి. విద్యుదాఘాతంతో గాయపడిన ఆయన్ను హాస్పిటల్‌కు తరలించారు.

స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు



నెల్లూరు(అర్బన్): నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను వైద్య, ఆరోగ్యశాఖాధికారులు ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. నగరంలోని వెంకటరమణ ఆస్పత్రి, విజయ డయాగ్నొస్టిక్స్, సింహపురి, శ్రీనివాస స్కాన్ సెంటర్లలో రికార్డులను జిల్లా లెప్రసీ, టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ, వెంకటాచలం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వేదవల్లి వాణిశ్రీ, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నరసింహరావు పరిశీలించారు. పీసీ, పీఎన్డీటీ యాక్ట్ ప్రకారం వ్యవహరిస్తున్నారాననే అంశాన్ని ఆరాతీశారు. లింగ నిర్ధారణ చేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. స్కానింగ్ చేసిన వారి వివరాలను ఫారమ్ – 4లో నమోదు చేసి వైద్యశాఖకు పంపాలని కోరారు. టీబీ నివారణ సిబ్బంది విజయకుమార్, హరీష్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా రక్త పరీక్షలు



రిజిస్టర్లను పరిశీలిస్తున్న హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్): సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు గానూ రక్త పరీక్షలను ల్యాబ్ టెక్నీషియన్లు పక్కాగా నిర్వహించాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. నగరంలోని పీసీ నాయుడి వీధి, జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో గల పట్టణ ఆరోగ్య కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ల్యాబ్ రిజిస్టర్లను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. జ్వరాలు నమోదవుతున్న ప్రాంతాల్లో ఆరోగ్య కార్యకర్తలు తక్షణమే స్పందించి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్ టెక్నీషియన్లకు సకాలంలో చేర్చాలని కోరారు. నూతనంగా రూపొందించిన రిజిస్టర్లను నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది కరుణమ్మ, గురవయ్య, సంజీవకుమార్, ఆరోగ్య పర్యవేక్షకురాలు గిరిజావతి తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ సెమిస్టర్ పరీక్షల్లో సత్తా



నెల్లూరు (టౌన్): బీఈడీ సెమిస్టర్ ఫలితాల్లో ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థులు సత్తా చూపారని ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను సంతపేటలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో మంగళవారం అభినందించిన అనంతరం ఆమె మాట్లాడారు. వర్సిటీ స్థాయిలో మహిమ 8.6, తమ్‌సీన్ 8.5 జీపీఏను సాధించారని పేర్కొన్నారు. 95 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఏపీటీఎఫ్ ముందుంటోందని జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 12వ పీఆర్సీ కమిటీని నేటికీ నియమించలేదని ఆరోపించారు. మున్సిపల్ పాఠశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేసి గుణాత్మక విద్యనందించేలా చూడాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మురళీకృష్ణ, పట్టణ శాఖ బాధ్యులు శ్రీనివాసులు, వెంగబాబు, మహేష్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండె వ్యాధి నివారణ మాత్రల అందజేత



నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో వాకర్స్‌కు గుండె వ్యాధి నివారణ మాత్రలను జెడ్పీ వాకర్స్ సంఘం, శుభమస్తు షాపింగ్‌మాల్ సౌజన్యంతో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ – 203 ఎలక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, సంగీత విద్వాంసురాలు వేదాంతం హర్షవర్ధినిని సత్కరించారు. జెడ్పీ వాకర్స్ సంఘ గౌరవాధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి ఖాజామస్తాన్, కోశాధికారి వెంకటరమణయ్య, చెంచయ్య, రాజగోపాల్, ప్రసాద్, ఎస్తేరు రాణి, మేరీ బ్లెస్సింగ్టన్, మెట్టు సృజన, ప్రసాద్, వీరగంధం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజానికి కృషి



శ్రీనివాసులును సత్కరిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): మూఢ నమ్మకాల్లేని శాస్త్రీయ సమాజం.. సైన్స్ ఫలాలు సామాన్యులందరికీ దక్కాలనే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందని వేదిక రాష్ట్ర నూతన అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని బాలకోటేశ్వరరావు ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ అభినందన సమావేశంలో జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్‌బాషా, డాక్టర్ బాలకోటేశ్వరరావు మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా ఉంటూ.. తన ఖాళీ సమయాన్ని వెచ్చిస్తూ జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైన్స్ ఉద్యమాల్లో శ్రీనివాసులు చురుకైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అనంతరం ఆయనతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా నుంచి ఎన్నికైన చక్రపాణి, రాష్ట్ర సలహా మండలి సభ్యుడు శేషారెడ్డి, కార్యదర్శి గీతాంజలిని సన్మానించారు.

పెద్దాస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి



తనిఖీలు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ మాధవి తదితరులు

నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని సూపరింటెండెంట్ మాధవి చెప్పారు. మదర్ అండ్ చైల్డ్ విభాగంలోని పలు వార్డులను హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం ఆమె తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలను ఆరాతీశారు. ఈ సందర్భంగా హెచ్‌డీఎస్ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు మాట్లాడారు. గదుల్లో దెబ్బతిన్న ఫ్లోర్ టైల్స్‌ను సరిచేయించాలని, మరుగుదొడ్లలో శుభ్రతతో పాటు బకెట్లు, మగ్గులుండేలా, నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. రాత్రి పూటా ల్యాబ్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. లిఫ్ట్‌లు సక్రమంగా పని చేయకపోవడంతో వృద్ధులు నడవలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్కానింగ్ పరీక్ష కేంద్రం వద్ద ఆలస్యాన్ని నివారించాలని కోరారు. అనంతరం మాధవి మాట్లాడారు. డాక్టర్లు, సిబ్బంది ఓపీల్లో సకాలంలో రోగులకు సేవలందించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సక్రమంగా విధులు నిర్వర్తించని వారిపై చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. గైనకాలజీ హెచ్ఓడీ గీతాలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి, అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ కళారాణి, హెచ్‌డీఎస్ కమిటీ నేతలు శ్రీనివాసులు, మొగరాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.